నమస్తే తెలంగాణ
హైదరాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024
TUESDAY, FEBRUARY 6, 2024



## బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన కంచర్ల

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం రాత్రి కేసీఆర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేఆర్‌ఎంబీ అంశంపై దక్షిణాది జిల్లాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

– మోత్కూరు, ఫిబ్రవరి 5

## బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



బండకొత్తపల్లికి చెందిన బాధితురాలికి బీమా చెక్కు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్

గుండాల, ఫిబ్రవరి 5 : ఆపదలో బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండకొత్తపల్లికి చెందిన కన్న ఉపేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు వరికోత యంత్రం కింద పడి మృతి చెందాడు. అలాగే వెల్మజాలకు చెందిన కచ్చిగళ్ల ఉప్పలయ్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతులు బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండటంతో సోమవారం యాదగిరిగుట్టలో జరిగిన బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బాధిత కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున బీమా చెక్కులను జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ దార సైదులు, మూగల శ్రీనివాస్, బొబ్బిలి సోమిరెడ్డి, గోపాల్‌దాస్ వెంకన్న, కోలుకొండ రాములు, కొమ్మగళ్ల దయాకర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో తార్కిక ఆలోచన పెంపొందించాలి

- డీఈఓ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

తుర్కపల్లి, ఫిబ్రవరి5 : విద్యార్థుల్లో తార్కిక ఆలోచన పెరిగేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాల సముదాయ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎల్‌లో భాగంగా అలైన్‌మెంట్ అనుసరిస్తూ విద్య బోధించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూపారాణి, మాలతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎంపీపీ సుశీలారవీందర్, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుశీల

తుర్కపల్లి, ఫిబ్రవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌ల స్థానంలో నియమితులైన ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, మోహన్‌బాబు, కోమటిరెడ్డి సంతోష, బోరెడ్డి వనజ, ఏఓ దుర్గేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 18 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖకు–9, మున్సిపాలిటీలకు–4, మెప్మాకు–2, విద్యాశాఖ, పొల్యూషన్, ఉపాధి కల్పన శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, ఇతర అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

- మండల విద్యాధికారి కృష్ణ



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ

బొమ్మలరామారం, ఫిబ్రవరి 5 : ఉపాధ్యాయులు కాలానుగుణంగా తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని మండల విద్యాధికారి కృష్ణ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి రోజారాణి ఆధ్వర్యంలో మండల పాఠశాలల స్థాయి కాంప్లెక్స్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని, ప్రణాళికల ఆధారంగా బోధన నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు వరలక్ష్మి, పెండెం నాగార్జున, నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'రోడ్డు విస్తరణకు సహకరించాలి'

మోత్కూరు, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ కేంద్రంలో రోడ్డు విస్తరణకు ఇండ్ల యజమానులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఇండ్లు కోల్పోతున్న వారికి విన్నవించారు. ప్రభుత్వం నిబంధనల మేరకు డివైడర్ మధ్య నుంచి 40 ఫీట్ల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారు తమ ఇండ్లను తొలగించుకోవాలని సూచించారు. లేకుంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఇండ్లు తొలగించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులను తొలగించాలని ధర్నా



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : జిల్లాలో బెల్ట్ షాపులను తొలగించాలని, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తిగా బెల్టు షాపులు నిషేధించాలని, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరారు. జిల్లాలో బెల్టు షాపులతోపాటు గంజాయి విక్రయాలు సైతం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బెల్టు షాపుల విక్రయదారులపై నామమాత్రపు కేసులు మాత్రమే నమోదు చేస్తున్నారని అన్నారు. మునుగోడు నియోజకవర్గం మాదిరిగా బెల్ట్ షాపులు, గంజాయి నిషేధించేందుకు చర్యలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.
అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మాటూరి జానమ్మ, వడ్లకొండ భారతమ్మ, ఆరె పుష్ప, ఇంజ హేమలత, మద్దూరి భాగ్యమ్మ, మంచాల రాధమ్మ, యాట మౌనిక, జంగ సరళ, బర్మ లావణ్య, రాగుల విజయలక్ష్మి, మంచాల సుగుణమ్మ, దూశెట్టి ఆండాలు పాల్గొన్నారు.

## కనీస వేతనం అమలు చేయాలి

- మున్సిపల్ చైర్మన్‌కు కార్మికుల వినతి



మున్సిపల్ చైర్మన్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చౌటుప్పల్, ఫిబ్రవరి 5 : స్థానిక మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజును సోమవారం మున్సిపల్ కార్మికులు కలిశారు. ఈ నెల 16న జరిగే సమ్మెకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాషా, నాయకులు దాసు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, అన్నపూర్ణ, శ్రీలత, జ్యోతి, కార్మికులు ఉన్నారు. అలాగే పట్టణ కేంద్రంలోని ట్రినిటీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గున్న రాజేందర్‌రెడ్డి, యానాల ప్రభాకర్‌రెడ్డి, వెన్‌రెడ్డి సంధ్య, ఉజ్జిని మంజుల, కేవీబీ కృష్ణారావు పాల్గొన్నారు.

## బీజేపీది ప్రజా వ్యతిరేక పాలన : ఐఎఫ్‌టీయూ



కొలనుపాకలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నదని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని కొలనుపాక, ఆలేరులో వేర్వేరుగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ బంద్ సమ్మె కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, బాలరాజు, సిద్ధులు, సిద్ధేశ్వర్, భాస్కర్, సోమరాజు, భుజంగం పాల్గొన్నారు.
భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె 'గ్రామీణ భారత్ బంద్‌ను' జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ చంద్రమౌళికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు పగిళ్ల లింగారెడ్డి, నాయకులు విష్ణు, బాలయ్య, సత్తయ్య, చాంద్‌పాషా, లింగస్వామి, బాబు, శంకరయ్య, లక్ష్మి, వెంకటమ్మ, జయమ్మ, స్వప్న, శారద, పద్మ, అమృత పాల్గొన్నారు.

## పరశురాం చిత్రపటానికి ఎమ్మెల్యే సామేల్ నివాళి

మోత్కూరు, ఫిబ్రవరి 5 : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ కుమారుడు ఎర్రవెల్లి పరశురాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం జరిగిన దశదినకర్మకు ఎమ్మెల్యే హాజరై పరశురాం చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, సోమిరెడ్డి, యాదయ్య ఉన్నారు.

## శ్రీను కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మోత్కూరు, ఫిబ్రవరి 5 : మున్సిపల్ కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ రెండో వార్డు అధ్యక్షుడు బోడ శ్రీను కుమారుడు మల్లేశ్ మృతి చెందాడు. సోమవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, మున్సిపల్ పట్టణాధ్యక్షుడు బొడ్డుపల్లి కల్యాణ్ చక్రవర్తి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్, అనిత, శైలజ, జ్యోతి, నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

వలిగొండ, ఫిబ్రవరి 5 : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన నాళ్ల అండమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి బీజేపీ నాయకుడు పీవీ శ్యాంసుందర్‌రావు సమకూర్చిన రూ.10 వేలను సోమవారం బీజేపీ నాయకులు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. మంగ జగన్, మైసోళ్ల మత్స్యగిరి, డోగిపర్తి సంతోష్, మారోజు అనిల్‌కుమార్, గుమ్మి సాయిరెడ్డి, మురళి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్ల ఎస్సీ కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన జోగు సత్తయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం కాలనీవాసులు ఆయనకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉప్పల మత్స్యగిరి, కూరెళ్ల నాగయ్య, రవి, గణేశ్, మత్స్యగిరి, సాయి, ఉపేందర్, శివాజీ, నాగరాజు పాల్గొన్నారు.

## అక్రమంగా చేపలు పట్టినవారిపై చర్యలు తీసుకోవాలి

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట మత్స్య కార్మిక సంఘం నాయకుల ధర్నా



నాయబ్ తాసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్య కార్మిక సహకార సంఘం నాయకులు

గుండాల, ఫిబ్రవరి 5 : మండలంలోని వెల్మజాల గ్రామ పరిధిలోని రాఘున్నకుంటలో గ్రామానికి చెందిన వ్యక్తులు అక్రమంగా చేపలు పట్టారని, దాంతో మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోతున్నారంటూ మత్స్య కార్మిక సంఘం ఆధ్వరంలో సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు పోతరబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ.. మత్స్య కార్మికుల ఉపాధికి గండి కొడుతున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మత్స్యకార్మికులు నాయబ్ తాసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గడుగు నర్సింహ, పూల సోమయ్య, దొంతరబోయిన ఎల్లయ్య, మైస బాలకృష్ణ, నాగారం రమేశ్, కాదరి లక్ష్మయ్య, కల్వల కృష్ణ, ఉప్పలయ్య, బాలరాజు, యాదయ్య, రమేశ్, నరేశ్, ఉపేందర్, శ్రీను, బాలమల్లేశ్, నవీన్, వినోద్, ప్రశాంత్, బాలకృష్ణ, మధు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ మండలాల నుంచి వచ్చిన జట్లు పోటీల్లో పాల్గొన్నట్లు యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రతికంఠం శంతన్‌రాజు, మురళీకృష్ణ తెలిపారు.

## 24 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : ఈ నెల 24 నుంచి 27 వరకు పట్టణ పరిధిలోని రాయగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణంలో జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మాజీ సర్పంచ్ కళ్లెం బాలనర్సింహ, మాజీ ఎంపీటీసీ పాల్త్య హనుమంతునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలేరు కుర్మ సంఘం కమిటీ

ఆలేరు, ఫిబ్రవరి 5 : కుర్మ సంఘం ఆలేరు పట్టణ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎగ్గిడి శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా చిమ్మి ఆనంద్, ఎగ్గిడి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా పత్తి వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా బోడ మహేశ్, దయ్యాల సంపత్, కోశాధికారిగా కొన్నె మల్లేశ్, కార్యదర్శులుగా మల్లెల శ్రీకాంత్, సభ్యులుగా మైల వెంకటేశ్, మల్లెల మహేశ్, జింకల భరత్, పేరపు శ్రీధర్, బుడిగె సిద్ధులు, జూకంటి వెంకటేశ్, చిన్నం రమేశ్, ఎగ్గిడి రమేశ్, ఎగ్గిడి మహేశ్, బండ్రు బీరుమల్లు ఎన్నికయ్యారు.

## జిల్లా కాంట్రాక్టర్ల యూనియన్ కమిటీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : జిల్లా కాంట్రాక్టర్ల యూనియన్ నూతన కమిటీని సోమవారం హైదరాబాద్‌లో ఎన్నికల అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా సూదగాని మల్లేశం, సలహాదారుడిగా ఎడ్ల సత్తిరెడ్డి, డీటీ మెంబర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు సలహాదారు సత్తిరెడ్డి తెలిపారు.



నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

## చట్టసభల్లో బీసీల వాటా సాధించాలి

- ఓబీసీ జాతీయ జాక్ చైర్మన్ నరేందర్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 5 : చట్టసభల్లో బీసీల వాటా సాధించాలని ఓబీసీ జాతీయ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మాట్లాడుతూ.. ఈ నెల 2వ వారంలో చట్టసభల్లో బీసీ వాటా సాధించడం కోసం తలపెట్టిన మహాపాద యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాపర్తి కుమార్‌గాడ్గే పటేల్, వనజ, వనిత, రమారెడ్డి, అరుణ, ఏలేందర్, సోమయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు దివిస్ చేయూత



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న భవాని

చౌటుప్పల్, ఫిబ్రవరి 5 : మున్సిపాలిటీ కేంద్రంలోని కేజీబీవీ, లింగారెడ్డిగూడెం ప్రైమరీ స్కూల్‌లో స్థానిక దివిస్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే పరిశ్రమ సహకారంతో విద్యార్థులకు రూ.2.60 లక్షల విలువైన స్కూల్ బ్యాగ్‌లు, పాదరక్షలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు జయంత్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారి భవాని, దివిస్ ప్రతినిధులు వెంకటరాజు, సాయికృష్ణ పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు అభినందన

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : స్వామి వివేకానంద, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో భువనగిరిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పట్టణంలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. వారిని ప్రిన్సిపాల్ మదిరె మల్లేశం సోమవారం కళాశాల ఆవరణలో అభినందించారు.



బీబీనగర్ : మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మండల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు.

## గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గానికి సన్మానం

బీబీనగర్, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులను మండల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేండ్లపాటు ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మిశ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ దస్తగిరి, మాజీ వార్డు సభ్యులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.
బొమ్మలరామారం : మండలంలోని సోలిపేట గ్రామపంచాయతీ మాజీ పాలకవరాన్ని, సిబ్బందిని గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడూరు నవీన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల ఏర్పాట్ల పరిశీలన

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : 56వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు, ఒలింపిక్ రన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య సోమవారం క్రీడల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్ మేనేజర్లు, 25 మంది టెక్నికల్ అఫీషియల్స్, 50 మంది పీఈటీలు, ఖో ఖో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నట్లు తెలిపారు. వారి వెంట అసోసియేషన్ సభ్యులు కృష్ణమూర్తి, దశరథరెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లేశం, రవీందర్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, ఫిబ్రవరి 5 : మూసీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం లక్ష్మాపురం మూసీ నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.

## కేసు విచారణ

వలిగొండ, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని మణికంఠ కిరాణాషాపులో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలకు వెళ్లారు. ఈ సందర్భంగా షాపు యజమాని చీకటిమల్ల నాగభూషణం, ఆయన కుమారుడు మణికంఠ నోటికొచ్చినట్లు వారిని దుర్భాషలాడారు. దాంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య సోమవారం విచారణ జరిపి సాక్షాధారాలు సేకరించారు.

## బీఆర్‌ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి



అడ్డగూడూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి

అడ్డగూడూరు, ఫిబ్రవరి 5 : ఈ నెల 7న తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగే భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని, అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చౌగోని సత్యం గౌడ్, మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, నాయకులు బైరెడ్డి నర్సిరెడ్డి, దాసరి బాలరాజు, గజ్జెల్లి రవి, సోమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పోలెపాక అబ్బయ్య, బాలెంల అరవింద్ పాల్గొన్నారు.

## అనంతారం శివారులో వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : అనారోగ్య కారణాలతో యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అనంతారం సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కి చెందిన సూర నాగరాజు(39) కొంత కాలంగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తన బైక్‌పై వచ్చి అనంతారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బైక్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేశారు. మృతుడి సోదరుడు ములుకల సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 5 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం కంచనపల్లికి చెందిన సాధు చంద్రశేఖర్‌రెడ్డి(23) వృత్తిరీత్యా హైదరాబాద్‌లోని వాటర్ వాషింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన బైక్‌పై వలిగొండ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా గూడూరు టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు విక్రమ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ యుగంధర్‌గౌడ్ తెలిపారు.